గురుకుల్‌ను కాపాడాలని లేఖలు



ఘట్‌కేసర్‌లో లేఖలు ప్రదర్శిస్తున్న దృశ్యం

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్‌కు పూర్వ వైభవం తేవాలని కోరుతూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులకు లేఖలు పంపే కార్యక్రమాన్ని చేపట్టారు. శుక్రవారం మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, మాజీ వార్డు సభ్యుడు వెంకటేశ్‌తో కలిసి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు లేఖలు పంపారు. ఈ సందర్భంగా పట్టణంలోని పోస్టాఫీస్‌లో రిజిస్టర్ పోస్ట్ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వీరేందర్‌యాదవ్, తిమోతి పాల్గొన్నారు.

మేనేజర్ అంజన్‌రెడ్డికి కమిషనర్‌గా పదోన్నతి



అంజన్‌రెడ్డి

పోచారం: పోచారం మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న డి.అంజన్‌రెడ్డికి భూదాన్ పోచారంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సహకారంతో పోచారం మున్సిపాలిటీలో పదవీ బాధ్యతలు నిర్వర్తించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

సంక్షేమ పథకాలు కాంగ్రెస్ కార్యకర్తలేనా?

ఘట్‌కేసర్: కాంగ్రెస్ కార్యకర్తలను సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని బీజేపీ సీనియర్ నేత మశ్చేందర్‌రెడ్డి ఆరోపించారు. అవుషాపూర్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రజా పాలన సభలు కాంగ్రెస్ పార్టీ సభలే అని అన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులను ప్రజల మధ్యన ఎంపిక చేయాలని, కమిటీల్లో కేవలం కాంగ్రెస్ నాయకులే ఉన్నారన్నారు. ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలను మోసం చేస్తున్నదన్నారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు, ఇళ్లను ఇవ్వనందునే పోటీ ఎక్కువ అయిందన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

కీసర ఇన్‌స్పెక్టర్ బదిలీ

కీసర: కీసర ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం. వెంకటయ్యను బదిలీ చేస్తూ రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ విభాగానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎస్‌ఓటీ మహేశ్వరం నుంచి కె.శ్రీనివాస్ కీసర ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై రానున్నారు.

లారీని ఢీ కొట్టిన కారు: కారు డ్రైవర్ మృతి

మేడ్చల్‌రూరల్: వేగంగా దూసుకొచ్చిన ఓ కారు లారీని వెనుక నుంచి ఢీ కొట్టిన సంఘటనలో కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మేడ్చల్ పోలీసుల సమాచారం మేరకు... సంగారెడ్డి జిల్లా రాయికోడ్‌కు చెందిన పంపాడ్ సంగమేశ్వర్(21) డ్రైవర్‌గా పని చేస్తూ నగరంలోని అంబర్‌పేటలో నివాసం ఉంటున్నాడు. గురువారం రాత్రి మార్కెటింగ్ వ్యాపారం నిర్వహించే నగరంలోని అఫ్జల్‌గంజ్‌కు చెందిన శికారి సుభాష్ కలిసి నెక్సాన్ కారులో ఓఆర్‌ఆర్ గుండా శామీర్‌పేట వైపు నుంచి దుండిగల్ వెళ్తున్నారు. ఈ క్రమంలో ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి కారు వేగంగా ఢీ కొట్టింది. దీంతో కారు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ సంగమేశ్వర్ అక్కడికక్కడే మృతిచెందగా సుభాష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తేనే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మేడ్చల్ రవాణా శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ సైకిల్ లిస్ట్ గ్రూప్, ది రాయల్ క్లబ్ ఆఫ్ రైడర్స్ గ్రూప్ సభ్యుల భాగస్వామ్యంతో పేట్ బషీరాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం రోడ్డు భద్రతా అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు నడిపే వారు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, జిల్లా రవాణా అధికారి రఘునాథన్‌గౌడ్, అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజు, ఎంవీఐ సాదుల శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, శ్రీను బాబు, శిల్పా, ఉమ, శ్రీకాంత్ రెడ్డి, హైదరాబాద్ సైకిల్ లిస్ట్ గ్రూప్ సెక్రెటరీ రవీందర్, బైక్ రైడర్ క్లబ్ వారు, రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక' పాలనపై కోటి ఆశలు!

- స్పెషల్ ఆఫీసర్ల నియామకం
- గత అసంపూర్తి పనులతో ప్రజలకు తప్పని ఇబ్బందులు
- నిధుల లేమితో కొనసా... గుతున్న అభివృద్ధి పనులు
- ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలంటున్న పట్టణవాసులు

ముగిసిన 'పురపాలికల' పదవీకాలం



సాక్షి, సిటీబ్యూరో: జిల్లాలోని పురపాలక సంఘాల పాలకవర్గాల కాలపరిమితి ముగిసింది. చైర్మన్ల స్థానంలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు. పాలకవర్గాలకు మొదటి రెండేళ్లు కోవిడ్–19తో సరిపోయింది. మిగిలిన మూడేళ్ల పాలనలో ఆశించిన మేర అభివృద్ధి కనిపించక ప్రజలు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ఈ పరిస్థితుల్లో పురాలకు ప్రత్యేక అధికారులు నియమితులయ్యారు. వారి ప్రత్యేక పాలనపైనే పురప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

- నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా ఏర్పడిన నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లసహా తొమ్మిది మున్సిపాలిటీల్లో జరిగిన అభివృద్ధి ఒకడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కులా ఉంది. పట్టణాల్లో పన్నుల వసూళ్లపై చూపిన శ్రద్ధను పురపాలికలు అభివృద్ధిపై చూపకపోవటంతో ప్రజలు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు.
- కొన్ని పురపాలికల్లో చిన్న పాటి వర్షం పడితే చాలు రోడ్లన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురిస్తే లోతట్టు ప్రాంతాలు, మురికి వాడలు వరదమయంగా మారుతుండగా, రోడ్లన్నీ అస్తవ్యస్తంగా నడవలేని స్థితికి చేరుతుండటంతో ప్రజలకు ఈతి బాధలు తప్పటం లేదు. ప్రధాన, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ తీరు చెప్పనలవి కాదు.
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లు, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపల్లి, దుండిగల్, తూంకుంట, దమ్మాయిగూడ, నాగారం, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలుగా ఏర్పడినా ఇక్కడి ప్రజలు సమస్యలతో సతమతం అవుతున్నారు.
- శివారు పట్టణాలను హైదరాబాద్ నగరానికి సమాంతరంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎన్ని ప్రణాళికలు రూపొందించినా ప్రజాప్రతినిధుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా ముందుకు అభివృద్ధి ఆశించిన స్థాయిలో లేదు.

ఎక్కడ సమస్యలు అక్కడే...

పురపాలక సంఘాల్లో ఎక్కడ సమస్యలు అక్కడే మూలుగుతున్నాయి. చెత్తాచెదారం, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారు. గ్రామానికి తక్కువ, పట్టణానికి ఎక్కువ అనే రీతిలో పురపాలక సంఘాల్లో అభివృద్ధి సాగుతోంది. ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెట్ల పొదలు, చెత్తాచెదారంతో పెరిగిన దోమల బాధను భరించలేని పరిస్థితులను ప్రజలు ఎదుర్కోవాల్సి వస్తోంది. మూసీ నది పరీవాహక ప్రాంతాల్లో దోమలు అధికమవుతున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటితే పలు కాలనీలు, బస్తీల్లో ఐదు నిమిషాలు కూడా బయట నిలబడలేకపోతున్నారు. పలు పురపాలికల్లో రోడ్లపై పారుతున్న మురికి, సైడు కాలువలతో స్థానికులు దోమల బాధ భరించలేకపోతున్నారు. ఈ సమస్యలపై ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

నాలుగేళ్లుగా అసంపూర్తిగానే...

జిల్లాలోని 13 పురపాలక సంఘాల్లో సమీకృత మార్కెట్లకు అర ఎకరం నుంచి రెండు ఎకరాల చొప్పున 16.82 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది.

- జవహర్‌నగర్, నిజాంపేట్, బోడుప్పల్, పీర్జాదిగూడ కార్పొరేషన్లలో మార్కెట్ల భవన సముదాయాలు, పార్కింగ్ నిర్మాణానికి రూ. 4.5 కోట్ల చొప్పున, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, దుండిగల్, తూంకుంట, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో మార్కెట్ల నిర్మాణానికి రూ. 2 కోట్ల చొప్పున అప్పటి సర్కారు నిధులు మంజూరు చేసింది. ఆ నిధుల విడుదల జాప్యంతో నాలుగున్నరేళ్లు గడిచినా ఇప్పటి వరకు ఒకటి కూడా ప్రజలకు అందుబాటులోకి రాలేదు.

పన్నులు సరే.. అభివృద్ధి ఏదీ..?

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల నుంచి పన్నుల ద్వారా రూ. 175 కోట్లు వస్తుండగా, 15వ ఆర్థిక సంఘం ద్వారా కూడా ప్రతి నెల ఒక్కో పురపాలక సంఘానికి రూ. 3 లక్షల నుంచి రూ. 21 లక్షల నిధులు విడుదలవుతున్నాయి. ఈ నిధులన్నీ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులకు వెచ్చించాల్సి ఉన్నా పట్టించుకోక పోవటంతో అవికాస్తా అభివృద్ధికి నోచుకోలేదు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్



చెక్కు అందజేస్తున్న వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నిరుపేదల అండగా నిలుస్తున్నదని టీ పీసీసీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ అన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన మున్సిపాలిటీలోని కొండాపూర్‌కు చెందిన ప్రమీలకు మంజూరైన రూ. 60 వేలు, మణెమ్మకు రూ. 60 వేలు, బాలాజీనగర్‌కు చెందిన సంధ్యకు రూ. 60 వేలకు సంబంధించిన చెక్కులను శుక్రవారం వారికి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజ్‌ముదిరాజ్, జంగయ్యయాదవ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ మశ్చేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లేశ్, ఉపాధ్యక్షుడు రఫీయుద్దీన్, ఖయూమ్, నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించేందుకే ఒలింపియాడ్



మాట్లాడుతున్న ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్

ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్

పోచారం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు ఒలింపియాడ్ వంటి పోటీలు దోహదపడతాయని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ జి.రమేష్ అన్నారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపూర్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్, ప్రసంగ పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇతరులకు ఎందులోనూ తీసిపోరని పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులు నిరూపించారన్నారు. జీవితంలో ఎదురయ్యే అన్ని పరిస్థితులను అధిగమించేందుకు ఇలాంటి పోటీలు సహాయపడతాయన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖాధికారి కె.సత్యనారాయణ మాట్లాడుతూ... విద్యార్థుల ప్రసంగ ప్రదర్శన అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. కొద్ది పాటి మెరుగులతో ప్రపంచస్థాయిలో పోటీ పడవచ్చని ఆకాంక్షించారు. 29 జిల్లాల నుంచి జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన 240 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు మెరిట్ సర్టిఫికెట్, జ్ఞాపిక, స్వర్ణ పతకంతో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్న వారికి వరసగా రూ. 5 వేలు, రూ. 3 వేలు, రూ. 2 వేలు చొప్పున నగదును అందజేశారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఈఎల్‌టీఏ), ఎస్‌సీఈఆర్‌టీ, భారతి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఈఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డీన్ వి.శ్రీనివాసరావు, భారతి ఫౌండేషన్ ప్రాజెక్ట్ హెడ్ భారిగెల శ్రీనివాసులు, ఈఎల్‌టీఏ కోర్ టీమ్ సభ్యులు పూల శ్రీనివాస్, డాక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సంపత్ కొక్కుల, లక్ష్మణ్ వంగర, టి.కుమారస్వామి, డాక్టర్ కోలా రవికుమార్, కృష్ణారెడ్డి, వినయ్‌కుమార్, జ్యూరీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

డీఈఓ విజయకుమారి

కీసర: విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేలా వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా విద్యా శాఖాధికారి విజయకుమారి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీలోని సెరినిటీ మోడల్ హైస్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ... నాగారం సెరినిటీ పాఠశాల విద్యార్థులకు చదువులతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లో రాణించేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, కార్యదర్శి నోముల వసంత, మేడ్చల్–మల్కాజిగిరి గెజిటెడ్ హెడ్‌మాస్టర్స్ అసోషియేషన్ సెక్రటరీ మురళీకృష్ణ, నాగారం కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిల్లు చెల్లించమన్నందుకు లైన్‌మన్‌పై దాడి

నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు

మల్కాజిగిరి: విద్యుత్ బకాయిలు ఉన్న వ్యక్తిని బిల్లు చెల్లించమని అడిగినందుకు ఏఎల్‌ఎంపై దాడి చేసిన సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కొండలు తెలిపిన వివరాల ప్రకారం... వసంతపురి సబ్‌స్టేషన్ సెక్షన్ పరిధిలో రెడ్యానాయక్ ఏఎల్‌ఎం (అసిస్టెంట్ లైన్‌మన్)గా పనిచేస్తున్నాడు. ఈ నెల 30వ తేదీ వసంతపురి కాలనీలో విద్యుత్ బకాయిలు ఉన్న సందీప్ అనే వినియోగదారుడి ఇంటికి విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. అదే ప్రాంతంలో కిరాణ దుకాణం వద్ద ఉన్న రెడ్యానాయక్ వద్దకు వచ్చిన సందీప్ దూషించడమే కాకుండా దాడి చేశాడు. రెడ్యానాయక్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు వెళ్లి సందీప్‌ను ప్రశ్నించగా వారిని కూడా దూషించాడు. ఈ సంఘటన పై రెడ్యానాయక్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భయపడుతున్న సిబ్బంది.. పట్టించుకోని ఉన్నతాధికారులు

మల్కాజిగిరి సబ్ డివిజన్ పరిధిలో వారం రోజుల్లోనే రెండు సంఘటనలు జరిగాయి. ఇప్పటికే పలు సబ్‌స్టేషన్లలో బిల్లు వసూళ్ల కోసం సిబ్బందిపై ఒత్తిడి తీసుకొని రావడంతో పాటు కొన్నిసార్లు దుర్భాషలాడుతున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వసూళ్లకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఉందన్నారు. రెండు సంఘటనలు జరిగినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం గమనార్హం.

ఉద్యమ కెరటం గద్దర్‌కు నివాళి



కీసరలో గద్దర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు



ఆర్‌జీకే కాలనీలో...

మేడ్చల్: తెలంగాణ ఉద్యమ కెరటం, ప్రజా యుద్ధ నౌక గద్దర్ (గుమ్మడి విఠల్‌రావు) జయంతిని మేడ్చల్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ కౌన్సిలర్ కొడే మహేశ్ కురుమ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోమారం రమణారెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్, నాయకులు లవంగు రాకేష్, దండు శ్రీకాంత్, మర్రి నర్సింహారెడ్డి, సత్యనారాయణ, రామన్నగారి సంతోష్‌గౌడ్, పుట్ట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కీసర పరిధిలో...

కీసర: గద్దర్ జయంతిని కీసర, ఆర్‌జీకే కాలనీలో నిర్వహించారు. అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము సుదర్శన్, ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బంటు శ్రీనివాస్, గోక కృష్ణ, జూపల్లి విజయ్ కుమార్, చినింగని శ్రీనివాస్, బైండ్ల చంద్రయ్య, జాతీయ మాల మహానాడు సంఘం మేడ్చల్ జిల్లా కన్వీనర్ గుజ్జుక పరుశరాం, మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోతే రాజేంద్రప్రసాద్, మాజీ అధ్యక్షులు రూపా చంద్రమౌళి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



పోచారం: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా పోచారం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి 11:30 గంటల వరకు పోచారం గ్రామం, డాక్టర్స్ కాలనీ, విజయ్ సాయి ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు ప్రతాపసింగారం ఫీడర్ పరిధిలోని రేణుక ఎల్లమ్మ, మక్త, సాయిశ్రీగార్డెన్, విట్టలేశ్వరకాలనీ, కొర్రెముల్, వెంకటాపూర్, తేనుగూడెం, టూబీహెచ్‌కే ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1:30 గంటల వరకు నారపల్లి ఫీడర్ పరిధిలోని వెంకటాద్రి టౌన్‌షిప్, చౌదరిగూడ, విజయపురి కాలనీ, శివాజీనగర్, ఓయూ కాలనీలలో విద్యుత్ కోత ఉంటుందని ఏఈ తెలిపారు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు కెనరానగర్ ఫీడర్ పరిధిలోని మారుతీనగర్, పీఅండ్‌టీ కాలనీ, ఓం విహార్ కాలనీలో కొంత భాగం, శివాలయం ఫీడర్ పరిధిలోని హరిహర ఎస్టేట్స్, శ్రీరాంనగర్ కాలనీ, ఉప్పల్ డిపో, ఉప్పల్ వర్క్ షాప్, న్యూసాయినగర్, శంకర్‌నగర్, బండి గార్డెన్స్, సన్‌రైజ్ బిల్డర్స్, గణేష్‌నగర్, పార్వతినగర్, శ్రీరామ ఆర్టీసీ కాలనీ, విష్ణుప్రియ ఎన్‌క్లేవ్, శ్రీపాద ఎన్‌క్లేవ్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వివరించారు.

శ్రీరామభద్ర క్షేత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు పూజలు



పూజల్లో మంత్రి శ్రీధర్‌బాబు

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ పోతాయిపల్లిలో కొలువైన శ్రీరామభద్ర క్షేత్రంలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం జరిగిన ఉపనయన కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రి శ్రీధరబాబును ఆలయ మర్యాదలతో సత్కరించారు. కమిషనర్ వెంకట గోపాల్ ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ కమిషనర్‌గా వసంత

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఎస్.వసంత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన డాకు నాయక్ జీహెచ్‌ఎంసీకి బదిలీ కాగా ఆమన్‌గల్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేసిన వసంత జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం నూతన కమిషనర్‌కి మేనేజర్ నగేష్‌బాబు, ఆర్‌వో వెంకటేశం, ఎల్లమ్మలు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



వసంతకు శుభాకాంక్షలు చెబుతున్న మేనేజర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

జీడిమెట్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆటో డ్రైవర్ మృతిచెందిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ హరిజనవాడకు చెందిన దప్పు శరత్‌బాబు (38) తన ఆటోలో న్యూస్‌పేపర్ తీసుకెళ్తుంటాడు. రోజు మాదిరిగానే శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఆటోలో న్యూస్‌పేపర్ తీసుకుని షాపూర్ నుంచి ఐడీపీఎల్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా బోల్తాపడి శరత్‌బాబు అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీ ఫుటేజీల ఆధారంగా గుర్తు తెలియని వాహనాన్ని గుర్తిస్తామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు మృతి..

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ అల్వాల్ కుమ్మరిబస్తీకి చెందిన నేమూరి శంకర్‌గౌడ్ (65) ఈనెల 26 ఇంటి నుంచి వెళ్లాడు. 2 రోజులైనా ఇంటికి రాకపోవడంతో కుమారుడు సంతోష్‌కుమార్ అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా గురువారం రాత్రి 11 గంటల సమయంలో శంకర్‌గౌడ్ చింతల్ ఆర్‌ఎన్‌సీ హాస్పిటల్ మెయిన్ రోడ్డు నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా షాపూర్ నుంచి బాలానగర్ వెళ్తున్న డీసీఎం వాహనం వెనకనుంచి ఢీకొట్టింది. ఈ విషయమై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా తీవ్రంగా గాయపడ్డ శంకర్‌గౌడ్‌ను పోలీసులు 108 అంబులెన్స్‌లో గాంధీ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు మృతిచెందాడు. కాగా మొదట గుర్తు తెలియని వ్యక్తి మృతిగా పోలీసులు భావించారు. శంకర్‌గౌడ్ అల్వాల్ పీఎస్‌లో అదృశ్యమైన కేసు ఉండగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు జీడీమెట్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాలి

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

సాక్షి, సిటీబ్యూరో: అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను మానవీయ కోణంలో ఆలోచించి ఒత్తిడులకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా చట్టపరమైన న్యాయం అందించే దిశగా జిల్లా యంత్రాంగం కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి చైర్మన్ వెంకటయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... అట్రాసిటీ కేసులను తక్షణమే పరిష్కరించి బాధితులకు వెంటనే న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టే పౌర హక్కుల రక్షణ చట్టం (ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్–పీసీఆర్), అట్రాసిటీ నివారణ చట్టం (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీ– పీవోఏ) చట్టాలను కచ్చితంగా అమలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ... కమిషన్ సూచనలు పాటిస్తూ, సమస్యలను త్వరితగతిన పూర్తి చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీకి సంబంధించిన భూసమస్యలను పరిష్కరించి నివేదికలను 15 రోజుల్లో అందజేయాలని ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. మల్కాజిగిరి డీసీపీలు కోటిరెడ్డి, పద్మజారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న చైర్మన్ వెంకటయ్య, కలెక్టర్ గౌతమ్

స్నేహ ఫౌండేషన్ సేవలు భేష్

మేడ్చల్‌రూరల్: స్నేహ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య అన్నారు. శుక్రవారం మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట ఫౌండేషన్‌ను ఆయన సందర్శించారు. ఆశ్రమంలో ఉన్న ప్రత్యేక అవసరాలుగల వారితో ముచ్చటించారు. కమిషన్ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు శేఖర్, లక్ష్మీనారాయణ, రాంబాబు, తహసీల్దార్ శైలజ పాల్గొన్నారు.

దేవరయాంజాల్‌లో పర్యటన..

శామీర్‌పేట్: మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజాల్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బి.వెంకటయ్య పర్యటించారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన పౌర హక్కుల దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సహపంక్తి భోజనం చేస్తున్న చైర్మన్ వెంకటయ్య